సాక్షి
సూర్యాపేట
7
బుధవారం । 22 । మార్చి । 2023



మట్టపల్లిలో నిత్య కల్యాణం
మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా జరిపించారు. - 8లో



ఆస్పత్రి ఎదుట ఆందోళన
వైద్యం అందకే శిశువు మృతి చెందిందని మంగళవారం దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట కొందరు ఆందోళన చేశారు. - 8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
34° / 23°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు



మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : ప్రకృతి అందించే షడ్రుచుల సమ్మేళనానికి ఉగాది పర్వదినం ప్రతీక అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అదే ప్రకృతి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలకు ఆయన శ్రీ శోభకృత్ తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. స్వరాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ఉమ్మడి నల్లగొండ జిల్లా మరింత పురోగతి సాధిస్తుందని మంత్రి ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

సంస్కృతి ఉట్టిపడేలా ఉగాది వేడుకలు జరుపుకోవాలి



వెంకట్రావు, కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సంస్కృతి ఉట్టిపడేలా ఉగాది వేడుకలు కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకోవాలని కలెక్టర్ యస్. వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. తీపి, పులుపు, చేదు, వగరు కలయికే ఉగాది పచ్చడి ప్రత్యేకత అని పేర్కొన్నారు. చైత్రమాసంలో నిర్వహించే ఉగాదికి ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు.

దళితుల అభ్యున్నతికే దళిత బంధు

తిరుమలగిరి (తుంగతుర్తి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి దళిత బంధు పథకాన్ని ప్రవేశ పెట్టిందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శిరీష తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం కింద ఇచ్చిన యూనిట్లను మంగళవారం అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు యూనిట్లను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, ఎంపీడీఓ ఉమేష్‌చారి, సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.


మహిళల ఆరోగ్య సంరక్షణకు కృషి

నూతనకల్: మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మహిళా ఆరోగ్య ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారి శ్రీహరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం ద్వారా అందుతున్న వైద్య సేవలను పరిశీలించి మాట్లాడారు. ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలకు వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంతింత కిందికి..

తగ్గుతున్న భూగర్భ జలాలు
- జిల్లాలో 5.21 మీటర్ల లోతుల్లోకి నీళ్లు
- నాగారం, నూతనకల్ మండలాల్లో వేగంగా తగ్గుముఖం
- రెండు నెలల్లో మరింత తగ్గే సూచనలు





భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో భూగర్భ జలాలు మెల్లమెల్లగా అడుగంటుతున్నాయి. ఎండలు పెరగడం.. నీటి వాడకం అధికం కావడంతో నీటిమట్టాలు క్రమంగా లోతుల్లోకి పడిపోతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో సరాసరి 5.21 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉన్నాయి. వేసవి కావడం, పంటలకు తోడుగా ఇతర అవసరాలకు నీటి అవసరం మరో రెండు నెలలకు పైగానే ఉండే అవకాశముంది. ఈ సమయంలో జిల్లాలో భూగర్భ జలాలు మరింత పాతాళానికి చేరనున్నాయి. అయితే గతేడాది ఇదే సమయానికి జిల్లాలో సరాసరి నీటిమట్టం 4.74 మీటర్ల లోతులో ఉండగా.. ఈసారికి వేగంగా నీటిమట్టాలు అడుగంటాయి.

రెండు మండలాల్లో..
జిల్లా భూగర్భ జలవనరుల శాఖ అధికారుల లెక్కల ప్రకారం ఫిబ్రవరి చివరి నాటికి జిల్లాలో సరాసరి 5.21 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. ఇందులో నాగారం, నూతనకల్ మండలాల్లో అత్యంత లోతులో 11.16, 11.79 మీటర్లకు పడిపోయాయి. 2022 ఆగస్టు మాసంలో 6.33 మీటర్ల లోతులో నీటిమట్టాలు ఉండగా.. వానాకాలంలో కురిసిన అధిక వర్షాల కారణంగా సెప్టెంబర్ మాసంలో 3.80 మీటర్లు, అక్టోబర్ నెలలో 1.76 మీటర్ల పైకి భూగర్భ జలాలు ఉబికి వచ్చాయి. అనంతరం వర్షాలు తగ్గముఖం పట్టడంతో నవంబర్ నెలలో 2.77 మీటర్లు, డిసెంబర్‌లో 3.94 మీటర్లకు పడిపోయాయి. నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ, మూసీ ప్రాజెక్టుల నీళ్ల రెండు పంటలకు వదలడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అందులోనూ వరి సాగు అధికం కావడంతో నీటిమట్టాలు వేగంగా పడిపోసాగాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరిలో 4.49 మీటర్లు, ఫిబ్రవరిలో 5.21 మీటర్లకు భూగర్భ జలాలు పడిపోయాయి.

గతేడాదితో పోల్చితే..
జిల్లాలో భూగర్భజలాలు గతేడాదితో పోల్చితే వేగంగానే పడిపోతున్నాయి. వానాకాలంలో అధికంగా వర్షాలు కురిసినప్పటికీ నవంబర్ మాసం నుంచి తిరిగి జిల్లాలో వర్షపాతం నమోదు కాకపోవడంతో నీటి మట్టాలు లోతుల్లోకి పడిపోతున్నాయి. గతేడాది ఇదే సమయానికి 4.74 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా.. ఈసారి 0.47 మీటర్ల లోతుల్లోకి వెళ్లి 5.21 మీటర్లకు చేరాయి. ఇందులో నాగారం, నూతనకల్ మండలాల్లో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయి. నాగారం, నూతనకల్ మండలాల్లో 2022 సెప్టెంబర్ మాసంలో కేవలం 1.82, 1.79 మీటర్ల లోతుల్లో ఉండగా ఫిబ్రవరి నాటికి ఏకంగా 11.19, 11.16 మీటర్ల పాతాళానికి భూగర్భ జలాలు చేరాయి. ఇక సూర్యాపేట మండలంలోనూ గతేడాది అక్టోబర్‌లో 3.49 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు ఉండగా ప్రస్తుతం 10.4 మీటర్ల లోతుల్లోకి చేరాయి.

గత ఏడాది, ఈ సారి ఫిబ్రవరిలో భూగర్భ జలాలు(మీటర్ల లోతుల్లో..)

మండలం	2022	2023	మండలం	2022	2023	మండలం	2022	2023
అనంతగిరి	2.67	2.54	జాజిరెడ్డిగూడెం	4.54	8.14	నాగారం	2.75	11.19
ఆత్మకూర్ (ఎస్)	3.50	4.32	కోదాడ	1.12	1.97	నేరేడుచర్ల	2.02	3.39
చిలుకూరు	0.96	6.06	మద్దిరాల	3.81	3.15	నూతనకల్	4.05	11.16
చింతలపాలెం	18.17	4.55	మఠంపల్లి	5.59	5.48	పాలకవీడు	6.43	1.93
చివ్వెంల	3.02	4.93	మేళ్లచెరువు	3.49	4.52	పెన్‌పహాడ్	2.80	6.85
గరిడేపల్లి	2.29	4.14	మోతె	2.34	1.73	సూర్యాపేట	9.26	10.42
హుజూర్‌నగర్	1.49	8.74	మునగాల	1.89	5.03	తిరుమలగిరి	9.68	2.77
			నడిగూడెం	3.58	6.26	తుంగతుర్తి	4.49	4.82

● సకల శుభాల శోభకృత్



వేప తియ్యగా నవ్వుతుంది..
తలనిండా నక్షత్రాలను పులుముకుని
చెరకుగడ అహపు చెక్కును విదుల్చుకొని
చేదును మనసారా కౌగిలించుకుంటుంది.
కారం వగరూ మమకారాన్నీ
ఉప్పూ పులుపూ వలపును
వాయినాలిచ్చుకుంటాయి.
శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది..
అందమైన ఆకాంక్షలు కలబోసుకున్న
ఆనందాల పునాది

● రైతన్నకు బాసటగా..



తిరుమలగిరి మండలం నెల్లిబండ తండాలో వడగళ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తదితరులు

చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- కలెక్టర్ వెంకట్రావు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో అధికారులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజలు తమ ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023 సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించారని దీనిలో భాగంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాలు నేటి నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో మిల్లెట్స్ పోషణ్ పక్వాడపై వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్ కార్యక్రమాలు, 25 నుంచి 28వరకు టీ–3 ఎనీమియా(రక్తహీనత)పై అవగాహన క్యాంపులు నిర్వహణ, 29న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో వర్క్ షాప్‌లు సెమినార్లు ఏర్పాటు చేస్తామని, 31న యోగా , ఏప్రిల్ 1న డిజిటల్ పొజిషన్ పంచాయతీ అనే కార్యక్రమాలు నిర్వహిస్తామని, మిల్లెట్స్ పై స్వయం సహాయక సంఘాలతో వర్క్ షాప్ ప్రమోషన్, ఏప్రిల్ 3న మిల్లెట్స్ కుకింగ్ కాంపిటీషన్ భర్తలతో ఏర్పాటు చేస్తారని కలెక్టర్ వివరించారు. పోషణలోపంలేకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ 15 రోజుల కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డీఏఓ రామారావు నాయక్ ,సీపీఓ వెంకటేశ్వర్లు, డీఎం రాంపతినాయక్ పాల్గొన్నారు.

తగ్గుతున్న ఆడ పిల్లల నిష్పత్తి
జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గుతోందని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఆరోగ్య సొసైటీ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగవివక్షపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని అందువల్ల స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. లింగ వివక్షపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెడాక్టర్ కోటాచలం, జెడ్పీ సీఈఓ సురేష్, డీపీఓ యాదయ్య, డీడబ్ల్యూఓ జ్యోతి పద్మ, డిప్యూటీ డీఎంహెచ్ఓలు హర్షవర్ధన్, డాక్టర్ నిరంజన్ పాల్గొన్నారు.

ఉగాది బోనాలు ప్రత్యేకం

- మోత్కూరులో 80 ఏళ్ల నుంచి కొనసాగుతున్న ఆనవాయితీ



ముత్యాలమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు (ఫైల్)

మోత్కూరు: తెలుగు నూతన సంవత్సర పర్వదినమైన ఉగాదికి యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీకి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి ప్రజలు ఉగాది పండుగను బోనాలతో నిర్వహిస్తారు. పూర్వకాలం నుంచి ఈ పండుగను యేటా ఇలా వినూత్న రీతిలో జరుపుకుంటారు.

ఊర ముత్యాలమ్మకు బోనాలు
సుమారు 80 ఏళ్ల క్రితం మోత్కూరులో కలరా ప్రబలి చాలా మంది చనిపోయారు. ఎంత వైద్యం చేసినా నయం కాకపోవడంతో అప్పట్లో ముత్యాలమ్మ తల్లి ఆగ్రహించిందని, బోనాలు సమర్పించాలని అప్పటి పెద్దలు నిర్ణయించారు. ఆ ఆచారం ప్రకారం బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఊర ముత్యాలమ్మకు చలి బోనాలు సమర్పిస్తుంటారు. అలా మొదలైన పండుగ నేటికీ కొనసాగుతోంది. ఇక్కడ ఉగాదికి పచ్చడి, మద్యం, మాంసంతో పాటు ముత్యాలమ్మకు బోనాలు సమర్పిస్తారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎడ్ల బండ్ల ప్రదర్శనలు నిర్వహించి అక్కడికి చేరుకున్న బోనాలతో ముత్యాలమ్మకు నైవేద్యంగా పెడతారు. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం, జామచెట్లబావి, కొండాపురం గ్రామాల ప్రజలు కూడా గ్రామ దేవతలకు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నైవేద్యంగా సమర్పిస్తారు.

‘శ్రీశోభకృత్’ శోభాయమానంగా ఉండబోతుంది



యాదగిరిగుట్ట: శ్రీశుభకృత్ నామ సంవత్సరం అన్ని శుభాలను ఇచ్చింది. ఇక శోభకృత్ నామ సంవత్సరం మరింత శోభాయమానంగా ఉండబోతుంది. శుభకృత్ సంవత్సరంలో అద్భుతమైన యాదాద్రీశుడి ఆలయాన్ని పునః ప్రారంభించుకొని భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాదిలో భద్రాది రాముడి ఆశీస్సులతో పుష్కరాలు సైతం వస్తుండటం సంతోషకరం. ఇక ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రీశుడి ఆలయంలో ఉదయం షడ్రుచులతో శ్రీస్వామి వారికి కొత్త కుండలో నివేదిస్తాం. సాయంత్రం 5.30 గంటలకు తూర్పు మాడవీధిలోని బ్రహ్మోత్సవ మండపంలో పంచాంగ శ్రవణం ఉంటుంది.
– కాందూరి వెంకటాచార్యులు, యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకులు

క్లుప్తంగా

యాదాద్రిలో సంప్రదాయ పూజలు


ఆంజనేయస్వామికి హారతినిస్తున్న పూజారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అనంతరం నైవేద్యాన్ని సమర్పించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాల యం, పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని, పూజలు చేశారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలను విశేషంగా నిర్వహించారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 20 మందికి తీవ్రంగా.. మరో 20మందికి స్వలంగా గాయాలు
- పలువురి పరిస్థితి విషమం.. గాంధీ ఆస్పత్రికి తరలింపు
- యాదాద్రి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఘటన

వలిగొండ / భువనగిరి: ఆర్టీసీ బస్సు చెట్టుకు ఢీకొని 20మందికి తీవ్ర గాయాలు కాగా.. మరో 20మందికి స్వల్పగాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపి 24జెడ్ 0119) మంగళవారం నల్లగొండ నుంచి 40మంది ప్రయాణికులతో భువనగిరికి బయలుదేరింది. మార్గమధ్యలో వలిగొండ మండలంలోని టేకులసోమారం వద్ద రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చిన చిన్నారిని తప్పించబోయి బస్సు డ్రైవర్ పక్కనే ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరికీ గాయాలయ్యాయి. పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనాల్లో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన 20మంది మినహా స్వల్పగాయాలైన వారు ప్రమాద స్థలం నుంచే వేరే వాహనాల్లో స్వస్థలాలకు వెళ్లిపోయారు.


టేకులసోమారం వద్ద చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు, నుజ్జునుజ్జయిన ముందు భాగం


ప్రమాదంలో గాయపడిన యువతిని హైదరాబాద్‌కు తరలిస్తున్న సిబ్బంది

భువనగిరి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స

టేకులసోమారం గ్రామం వద్ద జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను నాలుగు అంబులెన్స్‌లలో భువనగిరి పట్టణంలోని ఆస్పత్రికి తీసుకవచ్చారు. సుమారు 20 మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే వారికి వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించారు. ఇందులో పలువురు మహిళలతో పాటు వంశిక అనే చిన్నారి ఉంది. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన వారిని వివిధ పార్టీలకు చెందిన నాయకులు పరామర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు.

అరగంటకు పైగా బస్సులోనే ఇరుక్కున్న డ్రైవర్

ప్రమాదానికి గురైన బస్సులోని డ్రైవర్ క్యాబిన్ స్టీరింగ్‌కు మధ్యన ఇరుక్కుని అరగంటకు పైగా బాధపడ్డాడు. పోలీసులు, ప్రజలు డ్రైవర్ లింగ్యానాయక్‌ను అతి కష్టం మీద బయటకు తీశారు. అతనిని వెంటనే పోలీసు వాహనంలో భువనగిరి ఆసుపత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడిన పయాణికులకు ప్రాథమిక చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది


గాయపడిన డ్రైవర్ లింగ్యానాయక్

పుణ్యస్నానం ఆచరిస్తూ పరలోకాలకు..

- యాదాద్రి లక్ష్మీ పుష్కరిణిలో మునిగి భక్తుడు మృతి
- మృతుడు వనపర్తి జిల్లా వాసి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండ దిగువన గల లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తున్న ఓ భక్తుడు నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, ఆలయ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన మౌలాలి (19) తన తల్లి ఖాజాభానుతో కలిసి మంగళవారం యాదాద్రీశుడి చెంతకు వచ్చాడు. ఈ క్రమంలో ఉదయం 9గంటల ప్రాంతంలో మౌలాలి గండిచెరువు సమీపంలోని లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వెళ్లాడు. మౌలాలికి ఈత రాకపోవడం, అదే సమయంలో ఫిట్స్ రావడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న భక్తులు గమనించి అతడిని కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరి ఆడకపోవడంతో విగతజీవుడయ్యాడు.


లక్ష్మీపుష్కరిణి మెట్లపై మౌలాలి మృతదేహం

ఘటనా స్థలాన్ని యాదగిరిగుట్ట ఎస్ఐ చంద్రశేఖర్, దేవస్థానం పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహానికి భువనగిరి ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. తల్లి ఖాజాభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పుష్కరిణిలో భక్తుడు మృతిచెందిన నేపథ్యంలో ఆచార్యులు సంప్రోక్షణ నిర్వహించిన అనంతరం భక్తుల పుణ్యస్నానాలకు అనుమతించారు.

దుబాయిలో కప్పలకుంటతండా వాసి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి..
- స్వగ్రామం చేరిన మృతదేహం.. అంత్యక్రియలు పూర్తి

మేళ్లచెరువు: పొట్టకూటి కోసం దుబాయ్ వెళ్లిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల పరిధిలోని కప్పలకుంటతండాకు చెందిన ధారావత్ వెంకటేశ్వర్లు (45)కు, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్లు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, గ్రామంలో కూలి పనులు లభించకపోవడంతో వెంకటేశ్వర్లు ఉపాధి నిమిత్తం 2015లో దుబాయ్ వెళ్లాడు. అక్కడే తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల కాలంలో కుటుంబంలో జరుగుతున్న కలహాల కారణంగా వెంకటేశ్వర్లు మనస్తాపానికి గురై ఈ నెల 14న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే విషయాన్ని అక్కడి అధికారులు ఫోన్‌లో ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, దుబాయ్ ప్రభుత్వం అనుమతితో వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు అశ్రునయనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.


వెంకటేశ్వర్లు (ఫైల్)





ఆస్పత్రి ఎదుట ఆందోళన

దేవరకొండ: సకాలంలో వైద్యం అందించక శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ మంగళవారం కుటుంబ సభ్యులు, బంధువులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. దేవరకొండ పట్టణానికి చెందిన నోముల అఖిలకు మొదటి కాన్పులో పురిటి నొప్పులు రావడంతో మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కుటుంబ సభ్యులు దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు శశికళ, కృష్ణలు అఖిలను పరీక్షించి అప్పటికే కడుపులో ఉన్న శిశువు మృతిచెందినట్లు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం అఖిలను నల్లగొండకు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో హుటాహుటిన అంబులెన్స్ లో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి వద్ద అఖిల ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాగా అప్పటికే శిశువు మృతిచెందింది. సకాలంలో వైద్యం అందకనే శిశువు మృతిచెందిందని బంధువులు ఆందోళనకు దిగారు.

ఆరోపణలు అవాస్తవం..

అఖిలకు పూర్తిస్థాయి వైద్యం అందించామని, మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు రెఫర్ చేసినట్లు వైద్యులు రవి, కృష్ణ తెలిపారు. ఇందులో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని వారు పేర్కొన్నారు. దీంతో అఖిల బంధువులు మృతశిశువును తీసుకొని వెళ్లిపోయారు.

గిట్టుబాటు ధర దక్కలేదనే ఆవేదనతో..

- రోడ్డు వెంట జామకాయలు పారబోసిన రైతు
- ఎగబడి తీసుకెళ్లిన స్థానికులు, వాహనదారులు


పారబోసిన జామకాయలను తీసుకుంటున్న స్థానికులు

చౌటుప్పల్: తన తోటలోని జామకాయలను అమ్మేందుకు మార్కెట్‌కు వెళ్లిన రైతుకు సరైన మద్దతు ధర లభించకపోవడంతో, తక్కువ ధరకు అమ్ముకునేందుకు మనసు అంగీకరించలేదు. దీంతో జామకాయలు అమ్మగా వచ్చే డబ్బులు రవాణా ఖర్చులకు కూడా సరిపోవన్న ఆవేదనతో రోడ్డు వెంట పారబోశాడు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నూజివీడు ప్రాంతానికి చెందిన రైతు వెంకటేశ్వర్‌రావు జామ తోట దిగుబడికి వచ్చింది. దీంతో పంటను విక్రయించేందుకు గాను సోమవారం రాత్రి బాక్సుల్లో (ట్రేలలో) జామకాయలు నింపి గూడ్స్ వాహనంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొత్తగూడెంలోని పండ్ల మార్కెట్‌కు తీసుకెళ్లాడు. సాధారణంగా ఒక్కో బాక్సు ధర రూ.700 నుంచి రూ.800 ఉండాల్సి ఉంది. కానీ మంగళవారం మాత్రం వ్యాపారులు ఒక్కో బాక్సుకు కేవలం రూ.220 మాత్రమే ధర పెట్టారు. ఈ ధరకు పంట అమ్మితే రవాణా ఖర్చులకు కూడా సరిపోవని ఆవేదనకు గురైన వెంకటేశ్వరరావు అంత తక్కువ ధరకు పంటను అమ్మడం ఇష్టం లేక జామ లోడుతో తిరిగి నూజివీడుకు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా దాటాక గుండ్లబావి గ్రామ శివారులో జాతీయ రహదారి వెంట జామకాయలను పారబోశాడు. స్థానికులు గమనించి దగ్గరకు వెళ్లి పలకరించగా ఆ రైతు తన బాధను వారితో చెప్పుకున్నాడు. కాగా జామకాయలు పారబోసిన విషయాన్ని చూసిన స్థానికులు, వాహనదారులు ఎగబడ్డారు. జామకాయలను సంచులు, బస్తాల్లో నింపుకొని తీసుకెళ్లారు. క్షణాల్లో రోడ్డు వెంట ఉన్న జామకాయలు ఖాళీ అయ్యాయి. ఇదిలా ఉండగా బహిరంగ మార్కెట్‌లో మాత్రం కిలో జామకాయలు రూ.60 నుంచి రూ.80 ధర పలుకుతుండడం గమనార్హం. ఈ సంఘటనపై పలువురు రైతులు పాలకులను, దళారులను నిందించారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి


మాట్లాడుతున్న శ్రీపాద రామేశ్వర్

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని మెప్మా నల్లగొండ ప్రాజెక్టు డైరెక్టర్, నేరేడుచర్ల మున్సిపాలిటీ రెవెన్యూ స్పెషల్ ఆఫీసర్ శ్రీపాద రామేశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన నేరేడుచర్ల మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లపై మున్సిపాలిటీ రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఆస్తి పన్ను 73శాతం వసూలైందని, మిగిలిన 27శాతం ఈనెల 31వ తేదీ వరకు వసూలు చేయాలని ఆదేశించారు. కూల్చివేతకు సిద్ధంగా ఉన్న ఇళ్ల ఇంటి పన్నులు ఉన్నట్లయితే యాజమానులు ఇప్పటి వరకు ఉన్న పన్నులు చెల్లించి కూల్చివేతకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మేనేజర్ అశోక్ రెడ్డి, బిల్లు కలెక్టర్లు, వార్డు అధికారులు తదితరులున్నారు.

'అనురాగ్'లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు

అనంతగిరి: మండల పరిధిలోని అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐఈటీఈ హైదరాబాద్ చైర్మన్ మాలి నమః శివాయ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్లోబల్ నావిగేషన్, శాటిలైట్ సిస్టం, జీఎన్ఎస్ఎస్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. వీటి ద్వారా దేశంలోని వ్యక్తుల కదలికలు, నివాసాలను జీపీఆర్ఎస్ పద్ధతిలో తెలుసుకోగలమన్నారు. ఈ సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శివప్రసాద్, డాక్టర్ నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో గోడకూలిన ఘటనలో మరో విద్యార్థి మృతి

- రెండుకు చేరిన మృతుల సంఖ్య
- శాలిగౌరారం మండలంలో విషాదం

శాలిగౌరారం/ చివ్వెంల: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న నాగారం బీసీ గురుకుల పాఠశాల (జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాల)లో ఈ నెల 16న నీటి ట్యాంకు గోడ కూలిన ప్రమాదంలో చికిత్స పొందుతూ మరో విద్యార్థి మృతిచెందాడు. వాటర్ ట్యాంకు వద్ద స్నానం చేస్తున్నప్పుడు జరిగిన ఈ ప్రమాదంలో 5వ తరగతి విద్యార్థి మోతె మండలం అప్పన్నగూడెంకు చెందిన రావుట్ల పవన్ అక్కడికక్కడే మృతిచెందగా.. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని శాలిలింగోటానికి చెందిన కొప్పుల యశ్వంత్(10)కు తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఆరు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యశ్వంత్ మంగళవారం మృతిచెందాడు. యశ్వంత్ కుడి కాలు పాదం పూర్తిగా తెగి నుజ్జునుజ్జు కావడంతో శస్త్రచికిత్సలు చేసి తెగి దెబ్బ తిన్న కాలు పాదాన్ని అతికించేందుకు వైద్యులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ఆదివారం రోజు పాదంపై వరకు తొలగించారు. ఆ తర్వాత నుంచి యశ్వంత్ ఆరోగ్య పరిస్థితి మరింతగా క్షీణించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడటంతో యశ్వంత్ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు హాస్పిటల్ వద్ద ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది. శాలిలింగోటానికి చెందిన కొప్పుల కిరణ్–సత్యవతి దంపతులకు కుమారుడు యశ్వంత్(10), కుమార్తె ఉన్నారు. వీరు బతుకుదెరువు కోసం రెండేళ్ల క్రితం నల్లగొండకు వలస వెళ్లారు. యశ్వంత్‌కు చివ్వెంల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో సీటు రావడంతో అక్కడకు పంపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


యశ్వంత్ (ఫైల్)

రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ఉన్న యశ్వంత్ మృతదేహాన్ని రాష్ట్ర గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి మల్లయ్యభట్టు సందర్శించారు. యశ్వంత్ మృతికి నష్టపరిహారంగా రూ. 30 లక్షలు ఇవ్వాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు డబుల్‌బెడ్‌రూం ఇల్లు, దళితబంధు పథకం అమలు చేయాలని మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు యశ్వంత్ తండ్రి శ్రీనుకు గురుకుల విద్యా సంస్థలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం యశ్వంత్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురామ్ యశ్వంత్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

జన చైతన్య యాత్రలను జయప్రదం చేయాలి


లక్ష్మీనారాయణ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మల్లు నాగార్జునరెడ్డి

నేరేడుచర్ల: ప్రజా స్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణకు జన చైతన్య యాత్రలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నేరేడుచర్లలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తునన మతోన్మాద, కార్పొరేట్ విదానాలకు వ్యతిరేకంగా జన చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పంటలకు కనీసం మద్దతు ధరల చట్టాన్ని చేయాలని, ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేయాలని, 2006 అటవి హక్కు చట్టం ప్రకారం స్వాధీనంలో ఉన్న రైతులకు హక్కు పత్రాలను అందించాలని డిమాండ్ చేశారు.

ఆదర్శనేత లక్ష్మీనారాయణ

మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ రాజకీయాల్లో ఆదర్శనేతగా ఎదిగారని మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయం అరిబండి భవనంలో పెంచికల్‌దిన్న మాజీ సర్పంచ్. అరిబండి లక్ష్మీనారాయణ మనుమడు సుంకర క్రాంతికుమార్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే అరిబండి లక్ష్మీనారాయణ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సిరికొండ శ్రీను, కొదమగుండ్ల నగేష్, నర్సయ్య, తిరుపతయ్య, రాంమ్మూర్తి, మధు, నాగేశ్వర్‌రావు, శ్రీధర్, నర్సింహ్మ, నాగ సైదులు, ధనుంజయ తదితరులున్నారు.

కబేళాకు తరలిస్తున్న ఆవుల పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా తరలిస్తున్న ఆవులను కోదాడ రూరల్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని హనుమాన్‌జంక్షన్ సంత నుంచి 17 ఆవులను డీసీఎంలో హైదరాబాద్‌లోని చంద్రాయణగుట్ట కబేళాకు తరలిస్తున్నారు. మార్గ మధ్యలోని రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్‌రోడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. డీసీఎం ఓనర్ ఇమ్రాన్ ఖురేషి, డ్రైవర్ ఖరీంతో పాటు మరోవ్యక్తి అలీంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన నరేంద్ర మోదీ


రామన్నపేట: ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

రామన్నపేట: ప్రధాని మోదీ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బతీసి దేశసంపదను అదానీ, అంబానీ వంటి దోస్తులకు దోచిపెడుతున్నారని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం రామన్నపేటలో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదో ఆ పార్టీకి చెందిన స్థానిక నాయకులను నిలదీయాలన్నారు. దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దిక్కుమొక్కు లేని పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను భారీ మెజార్టీతో తిరిగి గెలిపించుకునే బాధ్యత పార్టీశ్రేణులపై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కేంద్రంలోని మోదీ సర్కార్ అడ్డుకుంటుందన్నారు. సమ్మేళనానికి ముందు రైస్ మిల్లు నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమ్మేళనంలో జెడ్పీచైర్మన్లు ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బండా నరేందర్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి డైరెక్టర్ ఒంటెద్దు నర్సింహారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలఫోరం అధ్యక్షుడు గుత్తా నర్సింహారెడ్డి, తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, గ్రామశాఖల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


భానుపురి: పంచాంగం ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

పంచాంగం ఆవిష్కరణ

భానుపురి (సూర్యాపేట): వైదిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన పంచాంగాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనాదిగా ప్రజలంతా ఈ పంచాంగాలను అనుసరించే తమ దినచర్యను కొనసాగించే వారని, ప్రస్తుతం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా ఈ పంచాంగాలను నమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌చంద్ర, యల్లంభట్ల రమేష్‌శర్మ, సుబ్రహ్మణశాస్త్రి తదతరులు పాల్గొన్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర సహస్రనామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని సంవాదాన్ని రక్తికట్టించారు. అనంతరం కల్యాణోత్సవంలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో పూజలు నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణ మంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి ,ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.